బియ్యం, చక్కెరే..!

- రేషన్‌లో సరుకుల కోత - ఆరు నెలలుగా అందని కందిపప్పు

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఆరు నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పుచారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.120 నుంచి 150 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

పేదల బతుకులు మారడం లేదు

-లక్ష్మి, కుమ్మరి వీధి కర్నూలు.

పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, ఉప్పు, కారం, చక్కెర, జొన్నలు, గోధుమలు, చింతపండు లాంటి నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. ప్రభుత్వాలు మారే కొద్దీ పేదలకు ఇచ్చే నిత్యవసర సరుకులు ఒక్కొక్కటి తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం బియ్యము, చక్కెర తప్ప ఏ సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. బయటకుందామంటే సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు చుక్కలను అంటుతున్నాయి. టమాటా చారు చేసుకుని చట్నీ నూరు కొని అన్నంలో కలుపుకుని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యవసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలి.

సరుకులు ఇచ్చి ఆదుకోవాలి

- పద్మ, పెద్ద మార్కెట్, కర్నూలు.

మూడు నెలలుగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కంది బేడలు ఇవ్వడం లేదు. దీంతో పప్పు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. భార్యాభర్తలం పగలంతా కష్టపడితే వచ్చే డబ్బులతో కుటుంబం మొత్తం కడుపునిండా మూడు పూటలా తిండి కరువైంది. పిల్లలకు మూడు పూటలా పెట్టి పెద్దలు ఒక పూట తిని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పేదల కోసం నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి లేదా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులైనా తక్కువ ధరలకు అందించి ఆదుకోవాలి.

ఎస్సీల ఆర్థిక స్వావలంబనకు రుణాలు

- జిల్లాలో 973 యూనిట్లు టార్గెట్
- రూ.40.73 కోట్లు కేటాయింపు
- ఈ నెల 10 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాశక్తి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.తులసీ దేవి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఎస్సీల ఆర్థిక స్వావలంభన కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను ప్రవేశపెట్టిందని కర్నూలు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.తులసీ దేవి అన్నారు. కార్పొరేషన్ ద్వారా జిల్లాలో ఈ ఏడాది 973 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, వాటి కోసం ప్రభుత్వం రూ.40.73 కోట్లు కేటాయించిందని తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 10 వరకూ గడువు ఉందని వివరించారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

ఎస్సీల అభివృద్ధికి కోసం ప్రస్తుతం ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నారు?

ఈడీ : ఎస్సీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాలను ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఏదైనా స్వయం ఉపాధి ఎంచుకుని దాని అభివృద్ధి పరుచుకునేందుకుగాను ఈ రుణాలను మంజూరు చేస్తున్నాం. ఈ రుణాలకోసం ఈ నెల 10వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నాం.

దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి సర్టిఫికెట్లు జతపరచాల్సి ఉంది?

ఈడీ : దరఖాస్తులు ఏదైనా యూనిట్ కోసం దరఖాస్తు చేసుకోదలచిన వారు తమ యొక్క ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర విద్యార్హత పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. వారి వారి విద్యార్హతలను బట్టి ఆన్లైన్లో దరఖాస్తుల యూనిట్లు ఓపెన్ అవుతాయి. సదర్ యూనిట్లకు వారు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. మొత్తం ఐఎస్‌బి, రవాణా, వ్యవసాయ రంగాలకు సంబంధించి 32 రకాలు యూనిట్లు అందుబాటులో ఉన్నాయి.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది..?

ఈడీ : దరఖాస్తుదారుడు ఓబిఎంఎస్ వెబ్సైట్ లో తమ దరఖాస్తును నింపి అప్లోడ్ చేసిన తర్వాత మొదటగా మండల పరిధిలో అయితే ఎంపీడీవో, అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ లాగిన్ కు చేరుతుంది. అక్కడి నుంచి ఒక నిర్దిష్ట తేదీని నిర్ణయించి వారు దరఖాస్తుదారులను పిలిచి కౌన్సిలింగ్‌లో వారితోపాటు బ్యాంకర్ల సమక్షంలో పరిశీలన చేసి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ఎంపికైన దరఖాస్తులను ఎంపీడీవో లాగిన్ నుంచి బ్యాంకర్ లాగిన్‌కు పంపుతారు. అక్కడ ఆపరేటివ్ నాన్ ఆపరేటివ్ అకౌంట్లో ఓపెన్ చేసి దరఖాస్తును తిరిగి ఎంపీడీవో/ మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి పంపుతారు. అక్కడి నుంచి నేరుగా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాగిన్‌కు చేరుతుంది. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ లాగిన్‌కు, అక్కడ ప్రొసీడింగ్స్ తయారై ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లాగిన్‌కు చేరుతుంది. అక్కడి నుంచి నేరుగా సబ్సిడీ దరఖాస్తుదారుని ఖాతాకు చేరుతుంది.

దరఖాస్తుదారుడికి ప్రభుత్వం గరిష్టంగా సబ్సిడీ ఎంత శాతం ఇస్తుంది?

ఈడీ : దరఖాస్తుదారునికి యూనిట్ మొత్తం విలువలో 40 శాతం సబ్సిడీని గరిష్టంగా ఇస్తుంది. 5 శాతం దరఖాస్తుదారుడు మార్జిన్‌గా వెచ్చించాలి. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా ఇస్తుంది.

జిల్లాలో మొత్తం ఎన్ని యూనిట్లు మంజూరుకు లక్ష్యంగా పెట్టుకున్నారు?

ఈడీ : జిల్లాలో మొత్తం 973 యూనిట్లు మంజూరుకు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. దీనికోసం రూ40.73 కోట్లు వెచ్చించింది.

సబ్సిడీని లబ్ధిదారునికి ఎలా చెల్లిస్తారు?

ఈడీ : లబ్ధిదారునికి రుణం మంజూరయ్యాక రెండేళ్ల పాటు లబ్ధిదారుడు వరుసగా కంతులను చెల్లించాలి. రెండేళ్ల తర్వాత లబ్ధిదారునికి సబ్సిడీ జమవుతుంది. ఐదు లక్షల పైబడి రుణం ఉంటే రుణం మొత్తాన్ని తీర్చాక చివరలో సబ్సిడీ జమ చేస్తారు. ఈ తరహా సబ్సిడీని బ్యాక్ ఎండ్ సబ్సిడీ అంటారు.

హంద్రీలో పెరుగుతున్న కాలుష్యం

- వ్యర్థాలతో నిండుతున్న నది.. భరించలేని దుర్వాసన
- కల్లూరు, శరీన్‌నగర్, దేవనగర్ వాసుల అవస్థలు
- స్పందించని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని కల్లూరు దేవనగర్ మధ్య హంద్రీ నదిలో రోజురోజుకు దుర్వాసన ఎక్కువైపోతుంది. కల్లూరు అర్బన్ ప్రాంతంలోని కల్లూరు, దేవనగర్, కష్ణానర్, శరీన్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఇలా హంద్రీ నది చుట్టుపక్కల ఏరియాల నుంచి వచ్చే మరుగునీరు నదిలో కలుస్తుండడంతో పాటు నదిలో చెత్త, చెదారం పేరుకుపోయింది.

వ్యర్థాలతో నిండి ఉన్న హంద్రీ

కర్నూలు నగరంలో ప్రవహించే హంద్రీ నదిని పురాణాల్లో హైంద్రావతిగా పిలిచేవారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో మద్దికేర మొగలవల్లి నాంచార్ల గ్రామాల్లో ఈ నది జన్మించింది. దాదాపు 16 కిలోమీటర్లు ప్రవహించి కర్నూలు జమ్మి చెట్టు ప్రాంతంలో తుంగభద్రా నదిలో కలుస్తుంది. ఈ నదిలో ఒక్కెర వాగు, మల్లి వాగు, పాలహింద్రి, నల్ల వంక వంటి వాగులు కలుస్తాయి. ఈ నది దాదాపు 50 గ్రామాలకు తాగునీరు, సాగునీటిని అందిస్తుంది. గతంలో నీటితో కళకళలాడే ఈ నది కబ్జా కోరల్లో కొట్టుమిట్లాడుతోంది. హంద్రీ నది కబ్జాకు గురైన ప్రాంతాలు. హంద్రీ నది ప్రారంభం నుండి అంతం వరకు ప్రధానంగా కబ్జాకు గురైంతి. కర్నూలు, కల్లూరు ప్రాంతంలో పందిపాడు వద్ద ఫ్యాక్టరీలు, ముజఫర్ నగర్, దేవన గారు వద్ద గల విఠల్ నగర్, టైలర్స్ కాలనీ, కిసాన్ ఘాట్, గౌరీ గోపాల్ వద్ద, హబీబ్ ముబారక్ నగర్, బుధవార్ పేట ప్రాంతాల్లో హంద్రీ నది కబ్జాలకు గురైంది. రోజు రోజుకూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. హంద్రీ నదిలో మురుగునీరు కలవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, చనిపోయిన జంతువులను పారవేయడం, చేపలు చనిపోవడం వంటి కారణాల వల్ల దుర్వాసన వస్తోంది. దీనితో పాటు, పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరగడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు కూడా ఆవాసంగా మారుతోంది. అంతేకాకుండా, నదిని ఆక్రమించి గుడిసెలు , ఇళ్ళు నిర్మించడం వల్ల వర్షాకాలంలో వరదలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ సమస్య చాలా తీవ్రమైనది, ప్రజల ఆరోగ్యం , జీవన నాణ్యతపై ప్రభావం చూపుతోంది. కర్నూలు కార్పొరేషన్ అధికారులు , సంబంధిత శాఖలు వెంటనే స్పందించి ఈ చనిపోయిన కుక్కల, పందుల కళేబరాలు, చెత్తా, చెదారాన్ని తొలగించి, నదిలో మురుగునీరు పారకుండా తగిన చర్యలు తీసుకుని ప్రక్షాళన చేసి ఇక్కడ నుండి వచ్చే కంపు నుండి కాపాడాలని, హంద్రీనది ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాసన భరించలేకున్నారు

- ఎస్ హుస్సేన్ బాష ముజఫర్ నగర్

హంద్రి నదిలో చెత్తాచెదారంతోపాటు కుక్కలు పందులు చనిపోయిన వాటిని తెచ్చిపడేయడంతో వాటి దుర్వాసన వస్తుంది. హంద్రి నదిలో నీరు తక్కువగా ఉండటంతో ఎండ వేడిమికి అందులో ఉన్న చేపలు, ఇతరాలు చనిపోయి అన్ని కలిసి వచ్చే వాసనను భరించలేకున్నాం.

మా దృష్టికి తెస్తే వ్యర్థాలకు తొలగిస్తాం

- ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కె. విశ్వేశ్వర్ రెడ్డి

నగరంలో ఎక్కడ ఏ జంతువు చనిపోయినా సచివాలయాల దృష్టికి కానీ ,శానిటరీ ఇన్స్పెక్టర్ల దృష్టికి, నా దృష్టికి దృష్టికి తెస్తే వెంటనే వాటిని తొలగించడానికి కృషి చేస్తాం. మాకు తెలియకుండా చనిపోయిన జంతువులను తెచ్చి అందులో వేస్తే మేము ఏమి చేయలేం. ప్రధానంగా హంద్రీనీ చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులది.

వ్యర్థ పదార్థాలతో కంపు

- కె.తిరుపాల్ రెడ్డి, కర్నూలు సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సిటీ అధ్యక్షులు

హంద్రీ నదిలో ఆక్రమణలు, వ్యర్థ పదార్థాలతో నిండిపోయి కంపు కొడుతుంది. ప్రధానంగా నగరంలోని మురుగునీరు హంద్రీలో కలవకుండా ఏర్పాట్లు చేయాలి. ఇందులోని కంపచెట్లను తొలగించి ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చెక్ డ్యాం కట్టాలి. అక్కడ నిలిచి ఉన్న నీటిని శుద్ధి చేసి ఆ నీటిని నగరంలో పచ్చదనం పెంచడానికి ఉపయోగించాలి. ఆక్రమాలు కాకుండా ఇరువైపులా బండ్ ఏర్పాటుచేసి మొక్కలు నాటి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే నీడను ఇచ్చే చెట్లతోపాటు, పాదచారులకు ఉపయోగకరంగా ఉంటుంది .ఆహ్లాదాన్ని పంచే విధంగా ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో అందంగా తీర్చిదిద్దాలి.

డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఎపిఎన్‌జిఒ సంఘం నాయకులు

డాక్టర్ చంద్రశేఖర్‌కు ఎపిఎన్‌జిఒ సంఘం సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటి వైస్ చాన్సలర్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ చంద్రశేఖర్‌ను ఎపిఎన్‌జిఒ సంఘం నేతలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విసిహెచ్ వెం గళ్‌రెడ్డి , కర్నూలు నగర అధ్యక్షులు ఎంసి కాశన్న, వ్యవసాయఉద్యోగుల సం ఘం జిల్లా అధ్యక్షులు రవి ప్రకాష్, ఎపి గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, లీలావతి,బంగారి, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యో గుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, నగర అధ్యక్షులు మద్దయ్య, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ సహాధ్యక్షులు, ప్రభాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కెసిహెచ్ కృష్ణుడు, బలరామిరెడ్డి, కర్నూలు నగర సంయుక్త కార్యదర్శి, నాగేంద్ర తది తరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తామని కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని, నిర్దేశిత గడువులోపు సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు.

నిరుపయోగంగా సింటెక్స్ ట్యాంక్

మురమ్మతుకు నోచుకోని బోరు -నీటి కోసం కాలనీవాసుల ఇబ్బందులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 31వ వార్డు పద్మావతి నగర్‌లో సింటెక్స్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. బోరుచెడిపోయి నెల రోజులు కావస్తున్నా రిపేరు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం నగర నాయకులు జి ఏసు తెలిపారు. త్వరగా బోరుని రిపేర్ చేయాలని ప్రజలకు నీళ్ల ఇవ్వాలని కోరారు. పద్మావతి నగర్ 31 వార్డులో ఎండలు తీవ్రంగా ఉన్నందున సింటెక్స్ ట్యాంకు రిపేరును అధికారులు వెంటనే చేయింయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వార్డు సభ్యులు పి మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యకర్తలు తిమ్మప్ప, బి కుమార్, కె. తిమ్మప్ప, తిప్పన మాట్లాడుతూ అధికారులు తొందర స్పందించి బోరును రిపేరు చేపించాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో భగీరథ మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్, సగర,ఉప్పర సంఘ నాయకులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో తాత్కాలికంగా మూతపడిన హాస్టల్స్‌ను కూడా తిరిగి ప్రారంభించబోతున్నామన్నారు. బిసి విద్యార్థుల కోసం డిఎస్‌సి స్టడీ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో బిసి వెల్ఫేర్ అధికారి కె.ప్రసూన, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, సగర సంఘం అధ్యక్షులు సత్యన్న, సగర సంఘం సొసైటీ కన్వీనర్ దూదే కొండ కుమార్, కర్నూలు జిల్లా సగర సంఘం గౌరవ ప్రెసిడెంట్ డాక్టర్ గిడ్డయ్య, సగర, ఉప్పర, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భగీరథ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి రంజిత్ బాష

భగీరథ విగ్రహం ఏర్పాటు చేయాలి: జిల్లా కేంద్రంలో భగీరథ విగ్రహం ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా భగీరథ సగర,ఉప్పర సంఘం అధ్యక్షుడు బి సత్యన్న జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఆ సంఘం తరఫున ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డాక్టర్ శంకర్‌శర్మ

-తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

వేసవిలో సమయం వథా చేయకుండా త్కెక్వాండో లాంటి క్రీడలు సాధన చేయాలని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్కెక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును వీకర్‌సెక్షన్ కాలనీ ప్రజాశక్తి ఎడిషన్‌కార్యాలయ ఆవరణలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డాక్టర్‌శంకర్‌శర్మ ఆదివారం ప్రారంభించారు. ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జి పి. చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఆత్మరక్షణకు సంబంధించిన యుద్ధక్రీడ తైక్వాండో దక్షణ కొరియాలో ప్రారంభమైందని తెలిపారు. ఎదుటి వ్యక్తిని గౌరవంగా చూడటం, పట్టువదలని క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురయినా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండాలని తైక్వాండో నిబంధనలో ముఖ్యాంశాలన్నారు. 2000 సంవత్సరం నుంచి తైక్వాండోకు ఒలింపిక్స్‌లో కూడా పాల్గొనే అవకాశం కల్పించారన్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలలో పాల్గొనే అవకాశాలు వస్తాయన్నారు. వారివారి సాధననుబట్టి గ్రేడింగ్ బెల్ట్‌లు ఇస్తారన్నారు. ఈ క్రీడలను ఆత్మరక్షణకోసం మాత్రమే వాడాలన్నారు. సాధన చేశానని ఎక్కడ బడితే అక్కడ ప్రయోగించరాదన్నారు. బయటి ప్రపంచంలో సంఘవిద్రోహశక్తులు, అమ్మాయిలను ఈవిటీసింగ్ చేయడం లాంటి వారిని ప్రతిఘటించే సందర్భంలో ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. దీంతోపాటు తైక్వాండో ఆత్మరక్షణకే కాదు, ఉన్నత చదువులలో, ఉద్యోగాలలో ఎంతో తోడ్పడుతాయని అన్నారు. డబ్బు, ఆస్తులు పోగొట్టుకుంటే తిరిగి సంపాదించవచ్చుని గడిచిన సమయాన్ని మాత్రం పొందలేమన్నారు. అందుకే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల పదోతరగతిలో ఒక అమ్మాయి అన్ని సబ్జెక్టులలో వందకు వంద మార్కులు సాధించిందంటే ఎలా వచ్చాయి అన్ని మార్కులంటే మా అమ్మాయి సెల్‌ఫోన్ వాడదు, సమయం వథా చేయదని తల్లిదండ్రులు చెప్పారని గుర్తుచేశారు. అందుకే మీరుకూడా తగిన జాగ్రత్తలో ముందుకెళ్లాలన్నారు. తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుస్సేన్‌ను కమిషనర్ అభినందించారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ చదువు క్రీడలు జీవిత లక్ష్యాన్ని నెరవేరుస్తాయని, చదువుతోపాటు క్రీడలను కూడా బ్యాలెన్స్ చేసుకోవాలన్నారు. పస్తుతం విద్యార్థులు సెల్‌ఫోన్లు, సినియాలు, టివిల వంటి వాటితో సమయం వథా చేయకుండా వేసవిలో తైక్వాండోలాంటి మార్షల్ హార్ట్స్‌లో సాధన చేయాలని అన్నారు. తైక్వాండో సాధనతో ప్రాణాయామం, యోగ, పిజికల్ ఎక్సర్‌సైజ్, చక్కటి క్రమశిక్షణ లాంటివి మెరుగుపడతాయని అన్నారు. చదువు ,క్రీడలలో చక్కటి భవిష్యత్తును పొందాలని క్రీడాకారులకు సూచించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ మాట్లాడుతూ చదువు జీవితాన్ని మార్చే ఆయుధమని, దానికి తోడుగా ఆరోగ్యాన్ని అందించేవి క్రీడలని సూచించారు. అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన తైక్వాండో క్రీడాకారులు డి.సుగంధిని, బి.లేక్యశ్రీచందన, షేక్ ఇర్ఫాన్ అహ్మద్‌లను అథితులు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ , విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొనేవారు ఈ నెంబర్‌కు సంప్రదించాలని 6302555345 కోరారు.

తైక్వాండో సమ్మర్‌కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, డాక్టర్ శంకర్‌శర్మ

సిల్వర్ జూబ్లీ కళాశాలపరీక్ష కేంద్రాన్నిపరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష

ప్రశాంతంగా నీట్ పరీక్ష

-98.10 శాతం విద్యార్థులు హాజరు

-సిల్వర్ జూబ్లీ కళాశాలపరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగాయని, 98.10 శాతం విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరైనట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా నీట్ పరీక్షను నిర్వహించారు. కర్నూలు నగరంలోని క్లస్టర్ వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో పరీక్ష నిర్వహణను జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కర్నూలు నగరంలోని 16 పరీక్షా కేంద్రాల్లో నీట్ యుజి పరీక్ష లు నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు మొత్తం 4466 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, ఇందులో 4381 విద్యార్థులు హాజరయ్యారన్నారు. 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, 98.10 శాతం విద్యార్థులు నీట్ పరీక్ష కు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు, పరీక్షల క్యాంప్ ఆఫీసర్ అక్తర్ బాను కూడా ఉన్నారు.

ప్రముఖ రంగస్థల నటుల చిత్రపటాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

మాట్లాడుతున్న డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి

కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మద్దూర్ నగర్ లో తెలుగుతోట ప్రధాన కార్యాలయంలో కర్నూలు జిల్లా రంగస్థలం ప్రముఖ కళాకారులు కీర్తిశేషులు లొద్దిపల్లి అల్లా బకాష్,, ఎన్టీఆర్ పురస్కార గ్రహీత, బిసికృష్ణ , ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత ఎస్ శ్రీనివాసులు, ప్రముఖ సంగీత విద్వాంసులు వారి చిత్రపటాలను పింగళి సూరన్న తోటలో జెఎస్ఆర్‌కె శర్మ, కెవి సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. కర్నూలు జిల్లా రంగస్థల నటులు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన చిత్రపటాలను ఆవిష్కరించడం అభినందనీయ మని వక్తలు కొనియాడారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుర్రపుశాల అంకయ్య పూల మాల వేశారు. ప్రముఖ రంగస్థల కళాకారులు పి దస్తగిరి, కళా ప్రియ తిరుపాలు, బైలుప్పల షఫీయుల్లా, డాక్టర్ సుభాన్, వివి రమణ రెడ్డి, హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషన్‌అలి, సిబి అజయ్ కుమార్, టి.రాజశేఖర్‌రావు, గోవిందరాజులు, డి పార్వతయ్య, డాక్టర్ అరుణ కుమారి, ముంతాజ్ పాల్గొన్నారు.

గొడవలకు వెళ్లొద్దు

- నాగలదిన్నెలో డీఎస్పీ ఉపేంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - నందవరం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో ఈనెల 6న జరిగే దేవర ఉత్సవాల్లో గొడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. ఆదివారం నాగలాదిన్నె గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఘర్షణలకు వెళ్లినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 40 ఏళ్ల క్రితం దేవర జరిగిందని, తిరిగి ఇప్పుడు మహోత్సవాన్ని గ్రామంలో చేపడుతున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ దేవర ఉత్సవానికి పోలీసు శాఖ తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని డీఎస్పీ తెలిపారు. తమకు కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామంలో పటిష్టమైన బందోబస్తు కల్పిస్తామని తెలిపారు. సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ కేశవ్ పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- మాధవరంలో 20 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మండలంలోని మాధవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి (2004-2005) చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కనువిందు చేసింది. 20 ఏళ్ల తర్వాత కలిసిన మిత్ర బృందం కుశల ప్రశ్నలు వేసుకొని కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మాధవరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో గతంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ముక్కరన్న, సిబెళగల్ ఎంఇఒ ఆదాం బాష, ఎమ్మిగనూరు బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, బనగానపల్లె టంగుటూరి ప్రధానోపాధ్యాయులు పర్వీన్ భాను, ఉపాధ్యాయులు శ్రీదేవి, గోపాల్, అనురాధ, జయరాజు, భీమన్న, ప్రేమమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రమోద్ కుమార్, హెప్సిబా, ఆర్ఎంపి డాక్టర్ నరసింహులును సన్మానించారు. అప్పటి గురువులు, విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తరగతి గదులను తమ స్థలాలను చూసి ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. గురువులకు మెమొంటో, శాలువా, పూలమాల, బహుమతులతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులపై పూల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులను ఘనంగా ఊరేగించారు. 2004-2005 పదో తరగతి బ్యాచి విద్యార్థులు భీమిరెడ్డి, ప్రవీణ్ కుమార్, బసవరాజు, తిరుమల నాయుడు, మధుకుమార్, మౌనయ్య ఆచార్, ఎమ్‌డి.నరసింహులు, అల్లే సురేష్, కృష్ణ, నరసప్ప, గుంటప్ప, మంజునాథ్ ఆచార్, బిజె రాజు, రమ్యశ్రీ, వనిత, సంధ్యారాణి, విజయలక్ష్మి, నరసమ్మ, భారతి, భీమేష్, రవి కుమార్, రమేష్, నరసన్న, నరసప్ప పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు భరోసా

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

సభ్యత్వం పొంది ప్రమాదాల్లో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు టిడిపి ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు తెలిపారు. ఆదివారం మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడును కుప్పగల్ గ్రామస్తులు కలిసి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొన్ని నెలల క్రితం పాండవగల్ దగ్గర కుప్పగల్‌కు చెందిన పూజారి ఈరన్న, పూజారి ఆదిలక్ష్మి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలిపారు. వారికి టిడిపి సభ్యత్వం ఉన్నందున వారికి ప్రమాద బీమా కింద రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యా యన్నారు. నాయకులు అప్సర్ బాష, అయ్యన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరు పత్రాలు చూపుతున్న మీనాక్షి నాయుడు

తుంగభద్ర కలుషితం..!

- నదిలోకి కలుషిత చేపల, రొయ్యల చెరువు నీరు

- నీరు తాగి అనారోగ్యం పాలవుతున్న ప్రజలు - పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - కోసిగి

తుంగభద్ర నదిలో వెళ్తున్న కలుషిత నీరు

అసలే వేసవికాలం.. తుంగభద్ర పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు లేక కళాహీనంగా మారింది. రాళ్లు తేలి గుంతలు పడింది. నీరు లేకపోవడంతో దాహం తీర్చుకునేందుకు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. కోసిగి మండలం తుమ్మిగనూరు, మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామాల్లో చేపలు, రొయ్యల చెరువులోని కలుషిత నీరు తుంగభద్ర నదిలోకి వదులుతున్నారు. ఆ నీరు తాగి సమీప గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

నది సమీపంలో ఉన్న చేపలు, రొయ్యల చెరువుల యజమానులు చేపలకు వినియోగించిన కలుషిత నీటిని నదిలోకి వదలడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ నిలిచిన నీటితో దాహం తీర్చుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో చేపలు, రొయ్యల చెరువు కలుషిత నీరు తుంగభద్ర నదిలో వస్తున్నాయని, గత్యంతరం లేక ఆ నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఆ నీరు తాగడం వల్ల జలుబు, జ్వరాలతో, నొప్పులతో ప్రజలు బాధపడుతున్నారు. ఇంత యథేచ్ఛగా నీరు వదులుతున్నా కనీసం తుంగభద్ర నదిలోకి ఆ కలుషిత నీరు రాకుండా ఆపేందుకు ఏ ఒక్క నాయకుడు కానీ, అధికారి కానీ ఆ గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలు సైతం ఇవే నీరు తాగి రోగాల బారిన పడుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి కలుషిత నీరు తుంగభద్ర నదిలో వెళ్లకుండా ఆపి, చేపల చెరువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు మండల కార్యదర్శి రాముడు

తుంగభద్ర నది పక్కనే ఉన్నప్పటికీ చుక్క నీరు లేక దాహం తీర్చుకునేందుకు నది పక్కనే ఉన్న గ్రామస్తులు చెలిమ నీటినే తాగుతున్నారు. ఈ మధ్యకాలంలో చేపల చెరువుల యజమానులు కలుషిత నీటిని తుంగభద్ర నదిలోకి వదలడంతో ఆ నీరు తాగి గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తాం.

మృతుని కుమారుడి చదువుకు చేయూత

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గిడ్డయ్య కుమారుడు అభిలాష్ ఉన్నత చదువులకు ఆర్థిక చేయూతనిస్తానని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు భరోసా ఇచ్చారు. ఆదివారం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్ర గౌడ సదాశివ, డైరెక్టర్ విజయకుమార్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గౌడ ఈరన్న, రంగస్వామితో కలిసి పరామర్శించి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. మృతుడు గిడ్డయ్య కుమారుడు అభిలాష్ పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించారన్నారు. ఉన్నత చదువుల కోసం తన వంతుగా సహాయం చేస్తానని చెప్పారు. మృతుల కుటుంబాలకు కూడా అందరి సహకారంతో ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రంజిత్ బాషా, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములును కలిసి విజ్ఞప్తి చేశామని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్ర గౌడ సదాశివ, డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. ఆదోనిలోని ఇందిరా గాంధీ నగర్‌లో మృతుల కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. త్వరలోనే మృతులు గిడ్డయ్య, శశికళ, లక్ష్మీ, చంద్రమ్మ, డ్రైవర్ కుమారుడు కురువ కుమార్ కుటుంబాలకు ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తామని తెలిపారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మునిస్వామి, గోవిందు, శ్రీనివాసులు, నాగరాజు, సత్య, నాగరాజు ఉన్నారు.

పరామర్శిస్తున్న ఉమాపతి నాయుడు, రుద్ర గౌడ సదాశివ

'ఉపాధి' కల్పనలో ప్రభుత్వాలు విఫలం : సిపిఐ

ప్రజాశక్తి- దేవనకొండ

ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు విమర్శించారు. ఈనెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరిగే ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం దేవనకొండలోని సిపిఐ కార్యాలయంలో ఎఐవైఎఫ్ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు బి.రవికుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా జాతీయ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి నరసరావు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, మండల నాయకులు అబ్బాస్, పరమేష్, రాహుల్, నరేష్, అశోక్, నబి రసూల్, రమేష్ పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోనిలో అభివృద్ధి కుంటు..!

- **చైర్మన్ భరోసా ఫలించేనా..?**
- **పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల సుముఖత**

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడింది. పాలకుల మధ్య సఖ్యత కరువై అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేగా పార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆదోని మున్సిపాలిటీలో ఆధిపత్య పోరుకు ఆజ్యం పడినట్లు అయింది. మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డికి విధేయుడుగా చెప్పుకుంటున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ శాంత భర్త సింహం నాగేంద్ర బిజెపిలో చేరారు. వైసిపి వశంలో ఉన్న మున్సిపల్ కౌన్సిల్‌లో గ్రూపులు మొదలయ్యాయి. కౌన్సిలర్లు వెల్లాల లలితమ్మ, చిన్న, పద్మావతి, సురేష్ వైసిపి నుంచి బిజెపిలో చేరారు. మున్సిపల్ సమావేశానికి ఎమ్మెల్యే పార్థసారథి హాజరవుతూ వచ్చారు అప్పట్లోనే వైస్ ఛైర్మన్లకు ప్రత్యేక కుర్చీలు అవసరం లేదని మెలిక పెట్టడంతో వైసిపి కౌన్సిలర్లు, అప్పటి మున్సిపల్ ఛైర్మన్ శాంత మధ్య వివాదం మరింత ముదిరింది. అప్పటి నుంచి వైసిపి కౌన్సిలర్లు వర్సెస్ అప్పటి ఛైర్మన్ బోయ శాంత అన్న రీతిలో రాజకీయం రాజుకుంది. ప్రతి సమావేశంలోనూ ఛైర్మన్‌ను నిందిస్తూ వైసిపి కౌన్సిలర్లు సమావేశాలను బాయ్‌కాట్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గత ఐదు నెలలుగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 16న అవిశ్వాస తీర్మానం పెట్టి బోయ శాంతను ఛైర్మన్ పదవి నుంచి దింపేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు వంటి పనులకు పర్సంటేజీ అడుగుతున్నారని పనులు ఆగిపోయాయి. ఇన్‌ఛార్జీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న ముల్లా మహ్మద్ గౌస్ శనివారం అధికారులు, కాంట్రాక్టర్ల కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అభివృద్ధికి బాటలు వేద్దామంటూ.. ఇంతవరకు జరిగింది వదిలి ఇప్పటి నుంచి సక్రమంగా పనులు చేస్తే సహకరిస్తామని కాంట్రాక్టర్లకు భరోసా ఇచ్చారు .

చిన్నపాటి వర్షమొచ్చినా బురదమయమవుతున్న ఇఎస్ఐ ఆస్పత్రి రోడ్డు

చైర్మన్ భరోసా ఫలించేనా

మున్సిపాలిటీ పరిధిలో గత నెల 10 నెలలుగా పనులు నిలిచిపోయాయి. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ, ఇతర అభివృద్ధి పనులు 56 గుర్తించి రూ.4.60 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. పలు దఫాలుగా టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పెండింగ్ పడుతున్నాయి. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వస్తే సకాలంలో బిల్లు మంజూరు చేయిస్తామని, ఎవరూ ఆటంక పరచరని ఇన్‌ఛార్జీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు భరోసా ఇచ్చారు. ఈనెల 8 వరకు టెండర్లు వేసుకునేందుకు తుది గడువు ఉంది. అప్పట్లోపు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు వేయాల్సి ఉంది. తాము సహకరిస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నా ఎం బుక్ రికార్డు చేయడం, ఆన్‌లైన్‌లో ఎక్కించడం వంటివి జాప్యం చేయడం వల్ల సకాలంలో బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికే రూ.లక్షల బిల్లులు రావాల్సి ఉందని, అప్పుల పాలవుతున్నామని చెబుతున్నారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఫైల్ మిస్ చేయడం, అమౌంట్ ఇస్తే తిరిగి ఇవ్వడం వంటి వాటికి కొందరు పాల్పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని, అప్పుడే పనులు చేసేందుకు ముందుకు వస్తామని సమావేశంలో కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

కాంప్లెక్స్ నిర్మాణం మొదలు

ఆదోనిలో సుమారు రూ.33 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు కూడా త్వరలో మొదలు పెట్టిస్తామని మున్సిపల్ ఇన్‌ఛార్జీ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్, వైస్ ఛైర్మన్ నరసింహులు హామీ ఇచ్చారు. లబ్ధిదారుల గుడ్ విల్ అమౌంటుతో నిర్మాణం చేపడుతున్నా ఎందుకు ఆటంకం కలిగించారంటూ లబ్ధిదారులు వాపోయిన దాఖలాలు ఉన్నాయి. ఎమ్మెల్యే అడ్డుకున్నారని, అప్పటి ఛైర్మన్ సహకరించడం లేదన్న విమర్శలు వచ్చాయి. ప్రస్తుత మున్సిపల్ కౌన్సిల్‌లో ఎలాంటి విభేదాలూ లేవని, అధికారులు సహకరించాలని ముల్లా మహ్మద్ గౌస్ తెలిపారు.

రాజా సాహెబ్ నగర్‌లో మధ్యలో నిలిచిన సిమెంట్ రోడ్డు

భక్తజనంతో కిక్కిరిసిన పెద్దహరివాణం

- వైభవంగా శ్రీగర్జి లింగేశ్వర స్వామి పట్టాభిషేకం

- ఆకట్టుకున్న ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

- ఉత్సవాల్లో ఒక్కటైన 55 జంటలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విగ్రహాల ఊరేగింపు

మండలంలోని పెద్దహరివాణం గ్రామం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. ఆదివారం శ్రీగర్జి లింగేశ్వరస్వామి పట్టా దేవర (పట్టాభిషేకం) ఉత్సవాలు వైభవంగా సాగింది. శ్రీగర్జి లింగేశ్వరస్వామి పంచం పట్టాభిషేకం దేవర ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ఉత్సవ విగ్రహ మూర్తుల ఊరేగింపు బీరప్ప స్వామి డోళ్లతో గ్రామం మార్మోగింది. దేవర సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. శ్రీగర్జలింగేశ్వర స్వామి, శ్రీఅయ్యమ్మవ్వ దేవరతోపాటు ముద్దటమ్యాగి గ్రామ నెరణికి లింగేశ్వర స్వామి, పెద్దహుల్తి గ్రామ హుల్తి కారుమంచప్ప స్వామి, బల్లూరు గ్రామ బల్లూరేశ్వర స్వామి, నెరణికి గ్రామ నెరణికి లింగేశ్వర స్వామి, అగలూరు గ్రామ సిద్ధలింగేశ్వర స్వామి, బదినెహాల్ గ్రామ బీరలింగేశ్వర స్వామి, ఉప్పళ గ్రామ కరిలింగేశ్వర స్వామి, నాగలాపురం గ్రామ నాగలింగేశ్వర స్వామి, కైరుప్పల కారుమంచి గ్రామ హుల్తికారుమంచప్ప స్వామి పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి గంగి పూజ నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి అన్ని దేవత ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే దేవర ఉత్సవాల సందర్భంగా 55 మందికి సామూహిక వివా హాలు నిర్వహించారు. ప్రజలందరీ సహకారంతో ఉత్సవా లు ప్రశాంతంగా జరిగాయి. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, వైసిపి మహిళా జిల్లా అధ్యక్షులు శశికళ కృష్ణమోహన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, వివిధ గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు తరలివచ్చారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. డీఎస్పీ హేమలత ఆదేశాల మేరకు ఆదోని తాలూకా సిఐ నల్లప్ప పర్యవేక్షణలో ఇస్వి ఎస్ఐ డాక్టర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సామూహిక వివాహాలు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం

- పాఠశాల, వసతి గృహం సమీపంలోనే దుకాణం

ప్రజాశక్తి - దేవనకొండ

తెర్నేకల్లులోని మద్యం దుకాణం

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మద్యం దుకాణం నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేశారు. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమైతే విద్యార్థులకు మద్యం ప్రియుల నుంచి కొంత ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. మద్యం దుకాణం దేవాలయాలకు, పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో ఉండాలని నిబంధన ఉంది. కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నిబంధనల పరిధిలో లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మద్యం దుకాణం పాఠశాలకు దగ్గరలో ఉండడం వల్ల రాత్రివేళలో పాఠశాల ఆవరణం మద్యం ప్రియులకు నిలయంగా మారే పరిస్థితి ఉందని, మద్యం సీసాలు పడి విద్యార్థులకు అసౌకర్యం కలిగించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో మద్యం దుకాణం లేకుండా దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఎక్సైజ్ శాఖ సిఐ విశ్వేశ్వర రావును వివరణ కోరగా... ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలకు, వసతి గృహానికి 100 మీటర్ల దూరంలో ఉందని తెలిపారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంత్యుత్సవం

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మిగనూరులో పాలాభిషేకం

భగీరథ జయంతి సందర్భంగా పట్టణంలో ఇంద్ర నగర్ ఉప్పర వీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో భగీరథ మహర్షికి ఆదివారం పూజలు చేశారు. జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భగీరథ యూత్ సభ్యులు రాజశేఖర్, శ్రీనివాసులు, విజయ్, రంగ, కృష్ణ, శాంతమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడరాదని అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. **కోసిగి**లోని ఊరు వాకిలి సూగురేశ్వర గుడి దగ్గర సంఘం అధ్యక్షులు ఈరన్న ఆధ్వర్యంలో ఉప్పర కులస్తుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి చిత్రపటానికి ఉప్పర సంఘం పెద్దలు పూజలు చేశారు. సంఘం పెద్దలు కృష్ణ, మానస మెడికల్ షాపు బసవరాజు, గుర్రం వీరేష్, లక్ష్మన్న, శివ, బసవరాజు, చిన్న హుస్సేని, వీరేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** ఉప్పర సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యుఎం.బాలాజీ అధ్యక్షతన ఉప్పర కల్యాణ మండపంలో భగీరథ మహర్షి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అక్కడి నుంచి శ్రీరామస్వామి దేవాలయం చేరుకొని భగీరథ మహర్షి చిత్రపటానికి ఉప్పర సంఘం అధ్యక్షులు పూల మాలలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నీలకంఠేశ్వర స్వామి దేవాలయం, సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామస్వామి దేవాలయం చేరుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షులు బండ్ల హరి, జాయింట్ సెక్రటరీ యువై.ఎల్లప్ప, కోశాధికారి యుఎం.మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యుఎం.చరణ్, యు.రమేష్, యు.వీరేష్, ఉప్పర కల్యాణ మండపం మేనేజర్ వీరేష్ పాల్గొన్నారు.

కనికరం చూపని అధికారులు

- ఎంహెచ్‌పి సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

విద్యుత్ నెలవారీ బిల్లు చెల్లించని వారికి వెంటనే కనెక్షన్ కట్ చేసే విధానానికి విద్యుత్ శాఖాధికారులు స్వస్తి పలకాలని ఎంహెచ్‌పి సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఒక్క నెల పెండింగ్ బిల్లు ఉందన్న నెపంతో విద్యుత్ కనెక్షన్ కట్ చేయడంతో ఒంటరి మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు అప్పటికప్పుడు బిల్లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనెక్షన్ కట్ చేయడం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. దీనిపై పట్టణంలోని ఎల్ఐజి కాలనీలో బాధితులు తమ దష్టికి తెచ్చారన్నారు. ఒక నెల బిల్లు కట్టని వారి కనెక్షన్ కట్ చేయడం దారుణమని తెలిపారు. కచ్చితంగా రెండు, మూడు రోజుల సమయం ఇవ్వాలని కోరారు.

ఈ రోడ్లు ఇంతేనా..?

- 'కూటమి'లోనే మారని రోడ్ల దుస్థితి

- భూమి పూజకే పరిమితమవుతున్న గ్రామీణ రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా రోడ్ల పరిస్థితి ఇంతేనా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. హోళగుంద నుంచి ఢణాపురం, హోళగుంద నుంచి వందవాగిలి, హోళగుంద నుంచి నాగరకనివి గ్రామానికి వెళ్లాలంటే రోడ్లన్నీ గుంతలమయంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. హోళగుంద నుంచి ఎల్లార్తి మీదుగా ఆలూరుకు వెళ్లే రోడ్డు సైతం బాగా లేదు. హోళగుంద నుంచి డివిజన్ జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే ఎటు చూసినా 30 కిలోమీటర్లు గుంతల రోడ్లలో ప్రయాణం చేయాల్సిందే... గతంలో రోడ్లకు భూమి పూజలు చేశారు. రోడ్లు వేయడం మరిచిపోయారు. గత ప్రభుత్వంలో అప్పటి ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, అప్పటి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మధ్య సఖ్యత కుదరక కాంట్రాక్టర్లు ఢణాపురం, హోళగుంద రోడ్డుకు భూమి పూజ చేసి వదిలి వెళ్లారు. అప్పటి నుంచి ఆ రోడ్డుకు పట్టిన గ్రహణం ఇంతవరకు వీడడం లేదు. రోడ్ల కోసం ప్రజా సంఘాలు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా ప్రభుత్వాలు, అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పరిష్కార మార్గం చూపడంలో పూర్తిగా విఫలమైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రోడ్లు బాగా లేకపోవడంతో బస్సులు ఏదో ఒక సమస్యతో మొరాయిస్తున్నాయని, ఆదోని డిపో బస్సులు తిప్పలేమని గతంలో మొండికేశారు. మండల ప్రజలు ఎపిఎస్ఆర్‌టిసి అధికారులతో వాగ్వానికి దిగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రోడ్లలో బస్సులు అటు ఇటు ఊగుతూ తిరుగుతున్నాయి. రోడ్లు ఇలా ఉండడం వల్ల ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం కూడా లేకపోలేదు. వర్షాకాలంలో బస్సు డ్రైవర్, కండక్టర్ల పరిస్థితి వర్ణనాతీతం. గత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అప్పటి ఎమ్మెల్యే పటేల్ నిరంజన్ రెడ్డి హయాంలో రోడ్ల మరమ్మతులు చేపట్టారు. 14 ఏళ్ల క్రితం ఆదోని, హోళగుంద రోడ్డు, ఆలూరు, ఎల్లార్తి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గుత్తేదారులు కాసులకు కక్కుర్తిపడి నాసిరకం రోడ్లు వేయడంతో పట్టుమని పదేళు కూడా పూర్తి కాకుండానే గుంతలు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ప్రజల జీవితాలు మాత్రం మారడం లేదు. ప్రస్తుతం ప్రతి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బి అధికారులను ప్రశ్నిస్తే 'ఇదిగో.. అదిగో' అంటూ పొంతన లేని మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. తప్ప రోడ్ల నిర్మాణాలు మాత్రం జరగడం లేదు. సరైన రోడ్డు మార్గాలు లేక రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రసవాలు పోయే రోడ్డుపైనే జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రజల బాగు కోసం పనిచేసే ప్రభుత్వాలు, పాలకులు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి, వెంటనే పనులు ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజల కోరుతున్నారు.

ఢణాపురం నుంచి హోళగుంద రోడ్డు (ఫైల్)

20న సమ్మెను జయప్రదం చేయండి

- ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి

ప్రజాశక్తి-పత్తికొండ

మాట్లాడుతున్న శివలక్ష్మి

కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి శివలక్ష్మి కార్మికులను కోరారు. ఆదివారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఆశా వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదన్నారు. ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా కుదించి కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు కార్యదర్శి గోపాల్, ఆశా కార్యకర్తలు ఈశ్వరమ్మ, అనిత, లక్ష్మి, మాబున్ని, రాములమ్మ వెంకటమ్మ పాల్గొన్నారు. అనంతరం పుచ్చకాయలమాడ పిహెచ్‌సి ఆశా వర్కర్స్ నూతన కమిటీ కార్యదర్శిగా పావని, అధ్యక్షులుగా రాములమ్మ, పత్తికొండ పిహెచ్ సి నూతన కమిటీ కార్యదర్శిగా స్వాతి, అధ్యక్షురాలుగా వెంకటేశ్వరమ్మను ఎన్నుకున్నారు.